కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని
తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ సంపుటి :05 సంచిక :136 ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ ఆదివారం 13-09-2026 పేజీలు : 4 వెల : రూ. 3/-

## ఫోన్, సిమ్ స్మగ్లింగ్ కేసులో అయిదుగురి అరెస్టు



బెంగుళూరు: మాజీ ప్రధాని హెచ్‌డీ దేవగౌడ మనువడు.. మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణఅత్యాచారం కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే. అయితే జైలులో అతని వద్ద ఇటీవల ఓ మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు. ఆ ఫోన్‌లో దజన్ల సంఖ్యలో అశ్లీల వీడియోలు ఉన్నట్లు ఇవాళ పోలీసులు వెల్లడించారు. అతని వద్ద ఉన్న పెన్ డ్రైవ్‌లో సినిమాలు, వెబ్ సిరీస్‌లు ఉన్నట్లు గుర్తించారు. ఆగస్టు 11వ తేదీన పరప్పాన అగ్రహారం సెంట్రల్ జైలులో అకస్మిక తనిఖీలు చేసి ప్రజ్వల్ నుంచి ఫోన్ సీజ్ చేశారు. దాన్ని ఫోరెన్సిక్ పరీక్షకు పంపారు. సెంట్రల్ జైలులో ప్రజ్వల్ వద్ద ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్ కలిగి ఉన్నట్లు గుర్తించారు. అతను జైలు నుంచి ఫోన్‌లో మరికొరితో మాట్లాడడాన్ని గమనించారు. అయిదు గంటల పాటు సెర్చ్ చేపట్టి, రేవణ్ణ బరాక్ నుంచి ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సీఈఎన్ పోలీసు స్టేషన్ దర్యాప్తు నిర్వహించింది. ఆ ఫోన్‌లో దజన్ల సంఖ్యలో పోర్న్ వీడియోలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆ ఫోన్ తనది కాదు అని, ఇతరులు కూడా జైలులో ఫోన్ వాడుతారని, కానీ రొటేషన్ పద్ధతిలో ఆ ఫోన్ తన వద్దకు వచ్చినట్లు రేవణ్ణ చెప్పారు.తానేమీ పోర్న్ వీడియోలు డౌన్‌లోడ్ చేయలేదన్నాడు. అతని వద్ద ఉన్న నోట్‌బుక్‌లో కుటుంబసభ్యులు, సన్నిహితుల ఫోన్ నెంబర్లు ఉన్నాయి. అనుమతి లేకున్నా కొందరి వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడినట్లు రేవణ్ణ అంగీకరించాడు. ఓ మహిళతోనూ అతను ఫోన్‌లో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. ఆ ఫోన్ కాంటాక్ట్‌లో, కాల్ హిస్టరీలో ఉన్న నెంబర్లకు త్వరలో నోటీసులు జారీ చేయనున్నట్లు పోలీసు అధికారి తెలిపారు.మొబైల్ ఫోన్‌ను ఖరీదు చేసిన అయిదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఆ ఫోన్‌ను, సిమ్‌ను జైలుకు పంపిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ప్రిజన్ వార్డెన్ ద్వారా ఆ ఫోన్ జైలులోకి వెళ్లినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఇక సిమ్ కార్డును మాత్రం ఓ అండర్‌ట్రయల్ ఖైదీ జైలు లోపలికి తీసుకెళ్లినట్లు తెలిసింది. సెప్టెంబర్ 8వ తేదీన రేవణ్ణ, రాయ్‌ని పోలీసులు మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకున్నారు. సెప్టెంబర్ 10న కోర్టు ఆదేశాల ప్రకారం ఆ ఇద్దర్నీ సెంట్రల్ జైలుకు తరలించారు.

## సచిన్, రహానేకు మరో గౌరవం



భారత మాజీ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, అజింక్యా రహానేలకు మరో గౌరవం దక్కనుంది. దిగ్గజ ఆటగాళ్లుగా కితాబులందుకున్న వీరి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్(విశ్రాంతి గదులకు)లకు పెట్టాలని ముంబై క్రికెట్ సంఘం (వీజూా) నిర్ణయించింది. టీమిండియాకు, ముంబై క్రికెట్‌కు విశేష సేవలందించినందున విశ్రాంతి గదులకు సచిన్, రహానే పేర్లను ఎంసీఏ ఖరారు చేసింది. వీరితో పాటు దివంగత మాధవ్ మంత్రి(మీుఃస్త్మ్రుజ మీుత్‌తీఱ) పేరుతోనూ లాంజ్ ఉంటుందని శుక్రవారం ఎంసీఏ తెలిపింది.ప్రభుత్వ నిర్ణయాలు తెలుసుకోండి.ముంబై క్రికెట్ సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. శుక్రవారం జరిగిన వార్షిక సమావేశంలో మాజీ క్రికెటర్ల పేర్లను లాంజ్(విశ్రాంతి గదులకు)లకు పెట్టాలని ఎంసీకే తీర్మానించింది. దేశవాళీలో ముంబైకి ఆడిన సచిన్ టెండూల్కర్, ఇటీవలే వీడ్కోలు పలికిన అజింక్యా రహానే.. ముంబై రంజీ జట్టు మాజీ కెప్టెన్, దివంగత మాధవ్ మంత్రి పేర్లను వాంఖడే స్టేడియంలోని లాంజ్‌లకు పెట్టనుంది.

సచిన్, రహానే, మాధవ్ పేర్లనే ఏ లాంజ్‌కు పెట్టాలి? వాటిని తీర్చిదిద్దేబాధ్యతను ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీకి, కార్యదర్శులకు అప్పగించామని ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్ వెల్లడించారు. ఎంసీఏ ఉపాధ్యక్షుడు జితేంద్ర అవ్హాద్, అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు మిలింద్ నర్వేకర్, సలహాదారుడు ఉజ్వల్ నికమ్ ఈ ముగ్గురు సభ్యుల కమిటీలో ఉన్నారు. వార్షిక సమావేశంలోనే అనుబంధ క్రికెట్ క్లబ్‌లకు రిజర్వ్ మొత్తంగా రూ.100 కోట్లు కేటాయించాలని ఎంసీఏ నిర్ణయించింది.

## ఆ ఒక్క కంపెనీకే రూ.1400 కోట్ల కాంట్రాక్ట్



కాంగ్రెస్ సర్కార్ ఖజానాలో పైసలేవ్ అంటూనే సామాన్య కాంట్రాక్టర్లను పట్టించుకోకుండా బడా కాంట్రాక్టర్లను వత్తాసు పలుకుతుందని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఫైర్ అయ్యారు.అసెంబ్లీలో అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో అండర్‌గ్రౌండ్ కేబులింగ్ కోసం రూ.1400 కోట్ల కాంట్రాక్ట్ ఒక్కటే కంపెనీకి తమను ఇచ్చారు. ఆ కంపెనీ చాలా లక్కీ కంపెనీ.. అన్ని కాంట్రాక్టులు ఆ కంపెనీకే దొరుకుతాయన్నారు. ఆ కంపెనీ బీజేపీకి కూడా డబ్బులు ఇస్తుంది.. అందుకే ఆ కంపెనీ పేరు చెప్పడం లేదన్నారు. ఆ కంపెనీ మాకైతే డబ్బులు ఇయ్యలేదు.. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం, రైతుల కోసం, ప్రజల కోసం అయితే సర్కార్ ఖజానాలో డబ్బుల్లేవ్.. డబ్బులేవ్ అని అంటారు..కానీ ఆ కాంట్రాక్టర్‌కు మాత్రం బరాబర్ బిల్లులు వస్తాయి.. కరెక్ట్ టైంకి డబ్బులు ఇస్తారని ఫైర్ అయ్యారు. ఆ కంపెనీకి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎన్ని బిల్లులు విడుదల చేశారో =×లో అడిగినా ఇవ్వడం లేదు.. నేను కోర్టుకు వెళ్లాను. రూ.1400 కోట్ల కాంట్రాక్ట్ ఆ ఒక్క పెద్ద కంపెనీకే ఇచ్చే బదులు చిన్న చిన్న కాంట్రాక్టర్లకు ఇవ్వొచ్చు కదా.. వాళ్లు కూడా బతకాలి కదా అని అన్నారు.

## వర్షం కురిసే..రైతన్న మురిసే.. సోయాబీన్, పత్తి పంటలకు ఊరట



గత నెల రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న కుభీర్ మండల రైతన్నలకు శనివారం కురిసిన వర్షం ఎంతో ఊరటనిచ్చింది. శనివారం మధ్యాహ్నం నుంచి మండలంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తుండడంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరిసింది. వరుణుడు కరుణించడంతో ఎండిపోతున్న పంటలకు ప్రాణం వచ్చినట్లైందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.గత నెల రోజులుగా మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ముఖ్యంగా సోయాబీన్, పత్తి అందకపోతే దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా పత్తి పంటకు కూడా ప్రస్తుత వర్షం ఎంతో అవసరమని రైతులు చెబుతున్నారు.వర్షాలు లేక నేలలో తేమ తగ్గిపోవడంతో పంటలు వాడిపోతున్న పరిస్థితి నెలకొంది. కొందరు రైతులు బోరు బావుల ద్వారా పంటలను కాపాడుకునేందుకు ప్రయత్నించినప్పటికీ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, నీటి కొరత వంటి సమస్యలు ఎదుర్కొన్నారు.ఈ తరుణంలో శనివారం మధ్యాహ్నం నుంచి వర్షం ప్రారంభం కావడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి.వర్షపు నీటితో పొలాల్లో తేమ పెరిగి పంటలకు ప్రయోజనం చేకూరుతుందని రైతులు భావిస్తున్నారు. మరికొన్ని రోజులు ఇదే విధంగా వర్షాలు కొనసాగితే సోయాబీన్, పత్తి పంటలకు మరింత మేలు జరుగుతుందని అన్నారు. వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్న రైతన్నలకు శనివారం కురిసిన వాన కాస్త ఉపశమనం కలిగించింది.

## ఏకపక్ష యుద్ధాల్ని ఖండించిన బ్రిక్స్ దేశాలు




బ్రిక్స్ దేశాలు ఉమ్మడి తీర్మానంపై ఏకాభిప్రాయానికి వచ్చాయి. శుక్రవారం రాత్రి నుంచి వేకువఝామున 4.00 గంటల వరకు జరిగిన చర్చల అనంతరం తీర్మానంపై ఏకాభిప్రాయం కుదిరినట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఏకపక్షంగా జరుగుతున్న యుద్ధాల్ని ఖండించాలని బ్రిక్స్ దేశాలు నిర్ణయించాయి. అయితే, ఈ తీర్మానంలో ప్రత్యేకంగా ఏ దేశాన్నీ ప్రస్తావించలేదు. ఈ తీర్మానంపై ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

నిజానికి ఇది క్లిష్టమైన నిర్ణయం. ఎందుకంటే ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో ఉండి, సదస్సులో పాల్గొంటున్న ఇరాన్, యూఏఈ, సౌదీ అరేబియాలు పరస్పరం దాడులు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇలాంటి యుద్ధ వాతావరణంలో ఆయా దేశాల మధ్య ఒక తీర్మానంపై ఏకాభిప్రాయం కుదర్చడం సాధ్యం కాదు. కానీ, భారత దౌత్యనీతి, దేశం అనుసరిస్తున్న ప్రమాణాల ద్వారా ఏకాభిప్రాయం కుదిరింది. ఆయా దేశాల మధ్య ఉన్న బేధాభిప్రాయాలను పక్కనబెట్టి.. ఒప్పందం కుదిరేలా ఇండియా వ్యవహరించింది. ఈ తీర్మానంపై చివరగా సభ్య దేశాధినేతలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది.అనంతరం దీనిపై ఉమ్మడిగా ప్రకటన చేస్తారు. ఈ సందర్భంగా దేశాధినేతలు కూడా పాల్గొంటారు. ప్రస్తుతం కూటమి దేశాల మధ్య వివిధ అంశాలపై చర్చలు జరుగుతున్నాయి. సదస్సు జరిగే భారత్ మండపం వద్దకు ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అబుదాబి రాజు ప్రిన్స్ ఖలేద్ బిన్ మొహమ్మద్ అల్ నహ్యాన్ అక్కడికి చేరుకున్నారు. సమ్మిళిత ప్రపంచ పరిపాలన, బహుళపక్షపాతవాదాన్ని బలపరచడం వంటి అంశాలపై చర్చలు జరుగుతాయి. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ సదస్సు ఆదివారం కూడా జరగనుంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా ఈరోజే ఢిల్లీ చేరుకున్నారు. ఇరాన్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్, ఇథియోపియా, ఇండోనేసియా దేశాధినేతలు కూడా పాల్గొంటున్నారు

## కొండా సురేఖకు మీనాక్షి ఫోన్!.. క్రియాశీలకంగా మారాలని సూచన



హైదరాబాద్, సెప్టెంబర్ 11 : మంత్రివర్గం నుంచి బర్ఫ్ అయిన కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీనటరాజన్ ఫోన్ చేసి మా ట్లాడారు. అంతర్గత విభేదాలు, వ్యక్తిగత కారణాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి క్రియాశీలకంగా మారాలని కొండా సురేఖకు సూచించినట్టు తెలిసింది. సురేఖ మంత్రివర్గం నుంచి బర్ఫ్ అయిన తర్వాత అసెంబ్లీ సమావేశాలకు హాజరుకావడం లేదు.నగర పర్యటనలను అన్వేషించండి .పార్టీ అధిష్ఠానం నుంచి స్పష్టమైన సూచనలు రావడంతో, ఇకనుంచి అసెంబ్లీ సమావేశాలకు కొండా హాజరవుతారా? లేదా? అన్న అంశంపై ఉత్కంఠ నెలకొన్నది.

## 54 ఏళ్ల వయసులో ఆడబిడ్డకు జన్మ



ఏథెన్స్: ఓ విషాద ఘటన ఓ జంట జీవితాన్ని మార్చేసింది. దశాబ్ధాల క్రితం నాడు ఫ్రీజ్ చేసిన పిండంతో.. 54 ఏళ్ల వయసులో ఓ మహిళ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన గ్రీస్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గత అక్టోబర్‌లో ఆ మహిళకు చెందిన 21 ఏళ్ల కొడుకు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆ దుఖాన్ని భరించలేక.. ఆ జంట మరో బిడ్డకు జన్మనివ్వాలని ప్లాన్ చేసింది. అయితే 22 ఏళ్ల క్రితం నాటి పిండంతో మరో బేబీ కోసం ప్రయత్నాలు మొదలుపెట్టింది. వాస్తవానికి గ్రీస్ ప్రభుత్వ నియమావళి ప్రకారం 54 ఏళ్ల వయసులో ఐవీ పద్ధతిలో తల్లి అయ్యేందుకు అనుమతులు లేవు. కానీ ఆ గడువుకు మరో 2 నెలల సమయం మాత్రమే ఉండడంతో.. 54 ఏళ్ల క్రిస్టినా రాప్తీ టెలిపి తన భర్తతో కలిసి కీలక నిర్ణయం తీసుకున్నది. 22 ఏళ్ల క్రితం ఫ్రీజింగ్ చేసిన పిండంతో బిడ్డకు జన్మనివ్వాని నిర్ణయించుకున్నది. ఎట్టకేలకు అనుమతి పొందిన క్రిస్టినా.. గత బుధవారం రాజధాని ఏథెన్స్‌లో 3.49 కిలోల బరువున్న బిడ్డకు జన్మనిచ్చింది. అయితే 22 క్రితం ఫ్రీజ్ చేసిన పిండంతో గర్భం దాల్చడం గమనార్హం. ఇది చాలా సుదీర్ఘమైన సమయం. గత ఏడాది అమెరికాలోని ఓహియోలో ఓ జంట 30 ఏళ్ల క్రితం ఫ్రీజ్ చేసిన పిండంతో బేబీకి జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ఆ జంట గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది.

## గుడ్‌న్యూస్ చెప్పిన దుబాయ్.. ఉద్యోగం వెతుక్కోవడానికి బంపరాఫర్!



విదేశాల్లో ఉద్యోగం చేయాలనుకునే వారికి అమెరికా వీసా నిబంధనలు కఠినతరంగా మారుతున్న సమయంలో.. దుబాయ్ మాత్రం ఉద్యోగార్థులకు ఆసక్తికరమైన అవకాశం కల్పిస్తోంది. జాబ్ ముందుగానే కన్ఫార్మ్ కాకపోయినప్పటికీ.. దుబాయ్‌కి వెళ్లి అక్కడే ఉండి ఉద్యోగం వెతుక్కునే అవకాశం కల్పించింది. ఈ మేరకు జాబ్ సీకర్ వీసాను అందుబాటులో ఉంచింది.సాధారణంగా విదేశాల్లో ఉద్యోగం కోసం వెళ్లాలంటే ముందుగానే కంపెనీ నుంచి ఆఫర్ లెటర్, స్పాన్సర్ లేదా ఉద్యోగ సంబంధిత అనుమతులు అవసరం అవుతాయి. అయితే యూఏఈ జాబ్ సీకర్ వీసా విషయంలో అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగా ఉద్యోగం పొందకుండానే దుబాయ్‌కు వెళ్లి స్థానిక లేబర్ మార్కెట్‌లో ఉద్యోగ అవకాశాలను నేరుగా వెతుక్కోవచ్చు.దుబాయ్‌లోనే ఉండి.. జాబ్ వేటఆన్‌లైన్‌లో దూరం నుంచే ఉద్యోగాలకు దరఖాస్తులు పంపడం కాకుండా.. దుబాయ్‌లోనే ఉండి కంపెనీలను సంప్రదించడం, ఇంటర్వ్యూలకు హాజరు కావడం, రిక్రూటర్లను కలవడం, తమ రంగంలో ఉన్న సంస్థలతో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకోవడం ఈ వీసా ద్వారా సాధ్యమవుతుంది.జాబ్ సీకర్స్ తమ అవసరానికి అనుగుణంగా 60, 90 లేదా 120 రోజుల వీసా వ్యవధిని ఎంచుకునే అవకాశం ఉంది. నిబంధనలు, అనుమతులకు లోబడి కొన్ని సందర్భాల్లో దీనిని 180 రోజుల వరకు పొడిగించే అవకాశం కూడా ఉంటుంది.అమెరికాలో విదేశీ ఉద్యోగుల వీసాల విషయంలో నిబంధనలు, పరిశీలనలు కఠినతరం అవుతున్న నేపథ్యంలో.. యూఏఈలో ఉద్యోగ అవకాశాలను అన్వేషించాలనుకునే వారికి ఈ విధానం ఆకర్షణీయంగా మారుతోంది. ముఖ్యంగా టెక్నాలజీ, ఫైనాన్స్, హాస్పిటాలిటీ, నిర్మాణం, ఇతర ప్రొఫెషనల్ రంగాల్లో తమ కెరీర్‌ను నిర్మించుకోవాలని భావించే వారికి అక్కడి మార్కెట్‌ను నేరుగా పరిశీలించే అవకాశం లభిస్తుంది. అయితే జాబ్ సీకర్ వీసా అంటే ఉద్యోగం గ్యారంటీ కాదు. దుబాయ్‌లోకి వెళ్లేందుకు, ఉద్యోగం వెతికేందుకు ఈ వీసా అవకాశం కల్పిస్తుంది కానీ ఉద్యోగ నియామకం మాత్రం అభ్యర్థి అర్హతలు, కంపెనీ అవసరాలు, నియామక ప్రక్రియపై ఆధారపడి ఉంటుంది.

## ఫ్రీగా కూల్‌డ్రింక్స్.. ఒక్కసారిగా ఎగబడిన జనం..



జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణంలో ఆసక్తికరమైన ఘటన చోటుచేసుకుంది. ఉచితంగా కూల్‌డ్రింక్స్ పంచుతున్నారని తెలియడంతో భారీగా జనం పోటెత్తారు. ఫ్రీ కూల్‌డ్రింక్స్ కోసం వందలాది మంది ఒక్కసారిగా ఎగబడటంతో అక్కడ స్వల్పంగా తోపులాట జరిగింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.మెట్‌పల్లి పట్టణంలోని ప్రధాన కూడలిలో ఉచితంగా కూల్‌డ్రింక్స్ పంపిణీ చేస్తున్న విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు అక్కడికి చేరుకున్నారు. మొదట కొద్దిమందితో ప్రారంభమైన పంపిణీ.. కాసేపటికే భారీ జనసందోహంగా మారింది. కూల్‌డ్రింక్స్ తీసుకునేందుకు ఒక్కసారిగా జనం ఎగబడటంతో అక్కడ సందడి నెలకొంది.జనం సంఖ్య పెరగడంతో కూల్‌డ్రింక్స్ కోసం పోటీ ఏర్పడింది. ఈ క్రమంలో కొద్దిసేపు తోపులాట చోటుచేసుకుంది. దీనికి సంబంధించిన దృశ్యాలను అక్కడున్న కొందరు తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించడంతో అవి సోషల్ మీడియాలోకి వచ్చాయి. ప్రస్తుతం ఈ వీడియో వైరల్‌గా మారింది.

అసలు ఎందుకు ఫ్రీగా ఇచ్చారు?

అయితే మెట్‌పల్లిలో కూల్‌డ్రింక్స్‌ను ఉచితంగా ఎందుకు పంపిణీ చేశారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఏదైనా కూల్‌డ్రింక్స్ కంపెనీ ప్రమోషన్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారా? లేక మరేదైనా ప్రత్యేక కార్యక్రమం సందర్భంగా పంపిణీ చేశారా? అనే విషయం స్పష్టంగా తెలియాల్సి ఉంది

## మాల్డోవాలో చిక్కిన గ్యాంగ్‌స్టర్ అమృత్‌పాల్ సింగ్.. ఇండియాకు అప్పగింత

పంజాబ్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ అమృత్‌పాల్ సింగ్ మాల్డోవాలో పట్టుబడ్డాడు. అతడిని పంజాబ్ పోలీసులు ఇండియాకు తీసుకురానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను పోలీసులు పూర్తి చేశారు. గ్యాంగ్‌స్టర్ అమృత్‌పాల్ సింగ్ ఇండియాలో అనేక నేరాలకు పాల్పడ్డాడు. పంజాబ్ సహా అనేక ప్రాంతాల్లో అతడిపై 21 క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. అతడు 2024 అక్టోబర్‌లో చండీగఢ్ నుంచి జారీ చేసిన ఫేక్ పాస్‌పోర్టు ఉపయోగించి,



ఇండియా నుంచి పారిపోయాడు.అప్పటినుంచి పంజాబ్ పోలీసులు అతడి కోసం గాలిస్తూనే ఉన్నారు. మొదట అతడు యూఏఈ వెళ్లాడు. తర్వాత అక్కడినుంచి వివిధ దేశాలకు వెళ్లిపోయాడు. చివరగా మాల్డోవా దేశం వెళ్లాడు. అక్కడినుంచి సరిహద్దు మార్గంలో ఉక్రెయిన్ వెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఈ ఏడాది ఫిబ్రవరి 24న మాల్డోవా పోలీసులు అరెస్టు చేశారు. మరోవైపు అమృత్‌పాల్ సింగ్‌ను పట్టుకునేందుకు పంజాబ్‌కుచెందిన యాంటీ గ్యాంగ్‌స్టర్ టాస్క్‌ఫోర్స్ (ఏజీటీఎఫ్)తోపాటు దేశీయ ఇంటెలిజెన్స్ సంస్థలు, వివిధ దేశాల సంస్థలతో కలిసి పని చేశాయి.అతడిని పట్టుకునేందుకు ఆపరేషన్ ఈస్టర్న్ రీచ్ పేరుతో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో మాల్డోవాలో ఉన్న అతడిని తీసుకొచ్చేందుకు పంజాబ్ పోలీసులు తీవ్రంగా శ్రమించారు. కేంద్ర సంస్థలు, మాల్దావా పోలీసులతో కలిసి చర్యలు చేపట్టాయి. అతడిని ఇండియాకు అప్పగించాల్సిందిగా మాల్డోవా ప్రభుత్వాన్ని ఇండియా కోరింది. దీనికి అక్కడి కోర్టు అంగీకరించింది. మే 26న అతడిని అప్పగించేందుకు అంగీకరించింది. అయితే, ఈ నిర్ణయాన్ని అతడు పై కోర్టులో సవాలు చేశాడు. దీనిపై ఇంతకాలం విచారణ జరిగింది. చివరకు అతడి పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేసింది.అతడిని ఇండియాకు అప్పగించాలని ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో అక్కడి చిసినౌ ఎయిర్‌పోర్టులో ఇండియాకు అప్పగించింది. సెప్టెంబర్ 12న అతడిని పంజాబ్ పోలీసులు ఇండియా తీసుకొచ్చారు. ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి ఇండియా చేరుకున్నాడు. అతడిపై నమోదైన 21 క్రిమినల్ కేసులపై విచారణ జరగనుంది.

# సాధ్విగా మారేందుకు 20 ఏళ్ల యువతికి అనుమతి..

భోపాల్,ఓ 20 ఏళ్ల యువతి భౌతిక సుఖాలను త్యజించి, తాను సాధ్విగా మారాలని నిర్ణయించుకుంది. అయితే, తమ కుమార్తె నిర్ణయాన్ని తల్లిదండ్రులు, ఆమె బంధువులు తీవ్రంగా వ్యతిరేకించారు. అందరిలాగే తమ కుమార్తెకు పెళ్లిచేసి, అత్తారింటికి పంపాలని భావించిన ఆ తల్లిదండ్రులు వద్దని వారించారు. కన్న కూతురిపై మమకారంతోనే వాళ్లు అభ్యంతరం చెప్పారు. దీంతో ఆమె న్యాయస్థానానికి వెళ్లారు. హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడంతో.. విచారణ చేపట్టింది. ఆమె తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించి, మద్దతు తెలిపింది.ప్రాపంచిక సుఖాలను త్యజించి, సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకున్న ఓ 20 ఏళ్ల యువతికి మధ్యప్రదేశ్ హైకోర్టు మద్దతుగా నిలిచింది. తన మతాన్ని స్వేచ్ఛగా అనుసరించే, ఆచరించే ప్రాథమిక హక్కు ఆమెకు ఉందని హైకోర్టు స్పష్టం చేసింది. అంతేకాదు, యువతి సహాయం కోరితే తల్లిదండ్రుల నుంచి ఎలాంటి బలవంతం లేదా వేధింపులు ఎదురుకాకుండా రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ మేరకు ఇండోర్ ధర్మాసనం తీర్పు వెలువరించింది. తనీషా అనే యువతి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను జస్టిస్ సందీప్ ఎన్. భట్ విచారణ చేపట్టారు.తాను శ్వేతాంబర్ జైన ధర్మాన్ని అనుసరించి, సన్యాసం స్వీకరించాలని నిర్ణయించుకున్నట్లు ఆమె కోర్టుకు వివరించారు. అయితే, ఈ నిర్ణయాన్ని తన తల్లిదండ్రులు, బంధువులు వ్యతిరేకిస్తూ వేధిస్తున్నారని, తనకు పోలీసు రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. అంతేకాదు, మతపరమైన దీక్షలో తల్లిదండ్రులు, బంధువులు జోక్యం చేసుకోకుండా నిరోధించాలని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, 21, 25, 26 ప్రకారం తనకు లభించే ప్రాథమిక హక్కులను స్వేచ్ఛగా ఉపయోగించుకోవడానికి అనుమతించాలని ఆమె కోరారు.పిటిషనర్ తరపున హాజరైన న్యాయవాది ఆశిష్ జోషి వాదనలు వినిపిస్తూ.. రక్షణ కల్పించాలని ఇండోర్ పోలీస్ కమిషనర్‌కు ఇప్పటికే ఫిర్యాదు చేశామని, అది ఇంకా పెండింగ్‌లో ఉందని తెలిపారు. పిటిషనర్‌పై ఆమె తల్లిదండ్రులు లేదా బంధువుల నుంచి ఎలాంటి వేధింపులు, బలవంతం లేకుండా చూడాలని కోరారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ గర్విత్ జైన్ హాజరయ్యారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి.. మేజర్ అయిన ఆమెకు 'తనకంటూ ఒక మార్గాన్ని ఎంచుకుని మతాన్ని అనుసరించే, తన ఇష్టానుసారం జీవించే హక్కు ఉంది' అని పేర్కొన్నారు.ఆమె ఇప్పటికే జైన ధర్మాన్ని అనుసరిస్తోందని, ఇప్పుడు ప్రపంచాన్ని విడిచిపెట్టి సన్యాసం జీవించాలని నిర్ణయించుకుందన్నారు. ఆమె తల్లిదండ్రులు, బంధువులు ఆమెపై ఉన్న ప్రేమానురాగాల వల్ల అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని కోర్టు గుర్తించింది. సమాజంలో పలుకుబడిన కలిగిన తల్లిదండ్రులు తనను దీక్ష తీసుకోనివ్వరనే పిటిషనర్ భయాన్ని కూడా కోర్టు నమోదు చేసింది.ఈ సందర్భంగా "పిటిషనర్ పట్ల ఎంత సానుభూతి ఉందో, ఆమె తల్లిదండ్రులు పట్ల కూడా అంతే సానుభూతి ఉంది" అని ధర్మాసనం పేర్కొంటూ, తల్లిదండ్రుల వ్యతిరేకత కూతురిపై ఉన్న మమకారం నుంచే వచ్చిందని గుర్తించింది. అయినప్పటికీ, 18 ఏళ్లు నిండిన వ్యక్తికి చట్టపరమైన హక్కుల రక్షణ పొందే హక్కు ఉందని, చట్టం దృష్టిలో ఎవరైనా కలిగించే అడ్డంకులను అనుమతించలేమని స్పష్టం చేసింది."లతా సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ యూపీ' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు ఈ సందర్భంగా ప్రస్తావించింది. మేజర్లు తమ స్వంత నిర్ణయాలు తీసుకోవడంలో స్వతంత్రులని, అలాంటి వారి ప్రయోజనాలను కాపాడటం కోర్టుల బాధ్యత అని పునరుద్ఘాటించింది. అంతేకాకుండా, పిటిషనర్ దరఖాస్తు చేసుకుంటే పోలీసులు ఎలా వ్యవహరించాలో సూచించడానికి 'శక్తి వాహిని వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' తీర్పును కూడా ఉదాహరించింది.పూర్తిస్థాయి ప్రాథమిక రక్షణ ఉత్తర్వులు ఇవ్వడానికి బదులుగా హైకోర్టు ఒక పరిష్కారాన్ని చూపింది. తన తల్లిదండ్రులతో సహా ఎవరైనా బలవంతం చేస్తే సహాయం కోరుతూ ఎస్పీ లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడానికి పిటిషనర్‌కు ఆదేశించింది. అలాంటి దరఖాస్తు అందగానే, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారి వెంటనే రంగంలోకి దిగి సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది.ఈ ఆదేశాలతో హైకోర్టు ఆ రిట్ పిటిషన్‌ను ముగిస్తూ.. పిటిషనర్ సహాయం కోరితే పోలీసులు జోక్యం చేసుకోవచ్చని స్పష్టం చేసింది. అదే సమయంలో, ఒకరి మతపరమైన ఎంపికను వారి కుటుంబం శాసించలేదని స్పష్టమైన వ్యాఖ్యలు చేసింది.

## అమెరికా నుంచి బంగారం తరలిస్తున్న నెదర్లాండ్స్

హైదరాబాద్,రష్యా, ఉక్రెయిన్ వార్ కారణంగా యూరప్, అమెరికా, ఇరాన్ యుద్ధం కారణంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ యుద్ధాల ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. అనిశ్చితి పెరుగుతున్న సమయంలో అమెరికాపై విశ్వాసం కూడా సన్నగిల్లుతోంది. నెదర్లాండ్స్ కేంద్ర బ్యాంకు (డీఎన్‌బీ) కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాలోని గణనీయమైన పరిమాణంలో బంగారం నిల్వలను సురక్షిత ప్రదేశానికి మార్చింది. అమెరికా, కెనడా నుంచి సుమారు 86 టన్నుల బంగారాన్ని లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వాల్ట్‌లో ఉంచింది. సంక్షోభ సమయంలో తక్షణ లావాదేవీలకు అనుకూలంగా ఉండేలా చేసిన వ్యూహంగా భావిస్తున్నారు.ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు మధ్య కాలంలో తరలింపు ఆపరేషన్ జరిగింది. మొదటి దశలో సుమారు 27 టన్నులను అమెరికా, కెనడా బ్యాంకుల నుంచి నేరుగా తీసుకొచ్చి నెదర్లాండ్స్ మీదుగా లండన్‌కు చేర్చారు. మిగిలిన భాగాన్ని న్యూయార్క్‌లో విక్రయించి, లండన్‌లో తిరిగి కొనుగోలు చేసే పద్ధతిని అవలంబించారు. రవాణా సమయంలో ఎదురయ్యే ప్రమాదాలు, భద్రతా సవాళ్లను దృష్టిలో ఉంచుకుని వివిధ దశల్లో, వేర్వేరు రూపాల్లో ఈ ప్రక్రియను పూర్తి చేశామని డచ్ కేంద్ర బ్యాంకు స్పష్టం చేసింది. ఇలా చేయడం వల్ల ఏకమొత్తంలో తరలించే రిస్క్ తగ్గిందని తెలిపింది.ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితులే బంగారం తరలింపునకు ప్రధాన కారణం.. అమెరికా, కెనడా మధ్య పరస్పర సుంకాలు విధించుకుంటున్న వాణిజ్య ఉద్రిక్తతలు, ఇరాన్‌తో సంబంధించిన ఉద్రిక్తతలు, పశ్చిమాసియా అశాంతి వంటివి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. ఇటువంటి అనిశ్చిత వాతావరణంలో బంగారం వంటి ఆస్తిని సులభంగా యాక్సెస్ చేసుకునే, వ్యాపారం చేసే ప్రదేశంలో ఉంచాలనే ఆలోచనతోనే ఈ చర్య తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.లండన్ ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం మార్కెట్‌గా నిలుస్తోంది. అక్కడ కొనుగోలు, విక్రయం, తాకట్టు వంటి లావాదేవీలు చాలా సులభం, వేగవంతం. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వాల్ట్‌లు అత్యంత ఉన్నత స్థాయి భద్రతా వ్యవస్థతో కూడి ఉన్నాయి. బాంబు దాడులను కూడా తట్టుకునేలా నిర్మించబడ్డాయి, అనధికార ప్రవేశం దాదాపు అసాధ్యం. ప్రపంచంలోని మొత్తం బంగారం నిల్వల్లో సుమారు ఐదో వంతు ఇక్కడ ఉంది. వీటిలో 90 శాతానికి పైగా విదేశీ కేంద్ర బ్యాంకులు, పెద్ద సంస్థలకు చెందినవి. కేవలం చిన్న భాగమే స్థానికం. అంతేకాకుండా, వాల్ట్ లోపలే ఒక దేశం నిల్వ నుంచి మరొక దేశం నిల్వకు మార్పిడి ద్వారా తరలింపు పూర్తవుతుంది. భౌతిక రవాణా అవసరం లేకుండానే దేశాల మధ్య బదిలీ సాధ్యమవుతుంది. ఇది సంక్షోభ కాలంలో కీలక ప్రయోజనం.అనేక దేశాలు తమ బంగారు నిల్వలను ఎక్కువ భద్రత, లిక్విడిటీ ఉన్న ప్రాంతాలకు మార్చుకుంటున్న ధోరణి కనిపిస్తోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భౌగోళిక రాజకీయ రిస్కులు పెరిగే కొద్దీ, బంగారం వంటి సంప్రదాయ

# సోషల్ మీడియాపై ప్రభుత్వ పెత్తనమేంటి?



హైదరాబాద్,ఈ మధ్య సోషల్ మీడియాలో ఒక చర్చ ఎక్కువగా కనిపిస్తోంది. ప్రభుత్వం ఏదైనా పోస్టు, వీడియో లేదా సమాచారాన్ని అభ్యంతరకరమని భావించి మెటా, ఎక్స్, యూట్యూబ్ వంటి సంస్థలకు సమాచారం పంపితే, ఆ సంస్థలు దాన్ని తొలగించాల్సిందేనా? ప్రభుత్వం చెప్పినంత మాత్రాన సోషల్ మీడియా సంస్థలు ఆ సమాచారం నిజంగా చట్టవిరుద్ధమా కాదా అని పరిశీలించకుండా తొలగించవచ్చా? మరి అదే అధికారాన్ని భవిష్యత్తులో మరో ప్రభుత్వం ఉపయోగిస్తే పరిస్థితి ఏమిటి? ఈ ప్రశ్నలు ప్రజాస్వామ్యంలో చాలా ముఖ్యమైనవి. ఈ చర్చలో ముందుగా ఒక చిన్న అపోహను సరిచేసుకోవాలి. చాలామంది దీనిని భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 73తో నేరుగా ముడిపెడుతున్నారు. కానీ సోషల్ మీడియా పోస్టులను తొలగించే నిర్దిష్ట విధానం ఆర్టికల్ 73లో లేదు. ఆర్టికల్ 73 ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వాహక అధికారం ఎంతవరకు విస్తరిస్తుంది అనే విషయాన్ని వివరిస్తుంది. పార్లమెంట్ ఏ అంశాలపై చట్టాలు చేయగలదో, సాధారణంగా ఆ అంశాల వరకు కేంద్ర కార్యనిర్వాహక అధికారం విస్తరిస్తుందని రాజ్యాంగం చెబుతోంది. అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా భారతకు లభించే హక్కులు, అధికారాల అమలు కూడా ఇందులోకి వస్తుంది.అంటే ఆర్టికల్ 73 కేంద్ర ప్రభుత్వానికి అపరిమితమైన అధికారం ఇచ్చిందని అర్థం కాదు. మొదటి మాటే "రాజ్యాంగంలోని ఇతర నిబంధనలకు లోబడి" అని ఉంటుంది. ప్రభుత్వం తన కార్యనిర్వాహక అధికారాన్ని ఉపయోగించినా రాజ్యాంగాన్ని, పార్లమెంట్ చేసిన చట్టాలను, పౌరుల ప్రాథమిక హక్కులను అతిక్రమించలేదన్నది ఇందులో కీలకమైన అంశం. ఇప్పటికే ఒక చట్టం ఉన్నప్పుడు ప్రభుత్వ చర్య కూడా ఆ చట్టానికి అనుగుణంగానే ఉండాలి.మరి సోషల్ మీడియా విషయంలో ప్రభుత్వం ఎక్కడి నుంచి అధికారాన్ని పొందుతోంది? ఇక్కడ ప్రధానంగా చూడాల్సింది సమాచార సాంకేతిక చట్టం 2000లోని సెక్షన్ 79, అలాగే దాని కింద రూపొందించిన సమాచార సాంకేతిక మధ్యవర్తుల మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమాలు 2021లోని రూల్ 3(1)(డి). సెక్షన్ 79 కొన్ని షరతులకు లోబడి సోషల్ మీడియా సంస్థలు వంటి మధ్యవర్తులకు వినియోగదారులు పోస్టు చేసిన సమాచారంపై చట్టపరమైన రక్షణ కల్పిస్తుంది. అయితే ఆ రక్షణ కొనసాగాలంటే ప్రభుత్వం నిర్దేశించిన విధివిధానాలను పాటించాల్సి ఉంటుంది.రూల్ 3(1)(డి) ప్రకారం, సమర్థ న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వు ద్వారా లేదా తగిన ప్రభుత్వ అధికారి నుంచి చట్టబద్ధమైన సమాచారం అందడం ద్వారా ఒక పోస్టు చట్టవిరుద్ధమని సోషల్ మీడియా మధ్యవర్తికి అధికారికంగా తెలిసినప్పుడు, దానిని తొలగించడం లేదా అందుబాటులో లేకుండా చేయాల్సిన బాధ్యత ఏర్పడుతుంది. భారత సార్వభౌమత్వం, సమగ్రత, దేశ భద్రత, విదేశాలతో స్నేహ సంబంధాలు, ప్రజా శాంతి, మర్యాద, నైతికత, కోర్టు ధిక్కారం, పరువు నష్టం, సంబంధిత నేరాలకు ప్రేరేపించడం వంటి చట్టపరంగా నిషేధించబడిన అంశాలు ఈ పరిధిలోకి రావచ్చు.ఇక్కడ 2025లో జరిగిన మార్పులు చాలా ముఖ్యమైనవి. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి సాధారణ ఫిర్యాదునూ తీసుకుని సోషల్ మీడియా సంస్థ పోస్టును తొలగించాలనే విధానం నిబంధన లేదు. ఇప్పుడు అలాంటి ఆదేశానికి నిర్దిష్టమైన చట్టపరమైన కారణం, ఏ చట్టంలోని ఏ నిబంధన ఉల్లంఘించబడిందో వివరణ, తొలగించాల్సిన నిర్దిష్ట యూఆర్ఎల్ లేదా ఎలక్ట్రానిక్ చిరునామా ఉండాలి. అంతేకాకుండా సాధారణ స్థాయి అధికారి కాకుండా కనీసం జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారి లేదా నిర్దేశించిన సమాన స్థాయి అధికారి నుంచి అనుమతి అవసరం. పోలీసు వ్యవస్థలో అయితే కనీసం డీఐజీ స్థాయి ప్రత్యేకంగా అధీకృత అధికారి ఉండాలి. ఈ ఆదేశాలను ప్రతి నెలా ఉన్నత స్థాయిలో సమీక్షించే విధానాన్ని కూడా తీసుకొచ్చారు. 2026లో మరో ముఖ్యమైన మార్పు వచ్చింది. అర్హమైన ఆదేశం అందిన తర్వాత చర్య తీసుకోవడానికి గతంలో ఉన్న 36 గంటల గడువు మూడు గంటలకు తగ్గింది. అంటే చట్టపరమైన " అందిన తర్వాత సోషల్ మీడియా సంస్థలు అత్యంత వేగంగా స్పందించాల్సి ఉంటుంది. ఇక్కడే అసలు ప్రజాస్వామ్య చర్చ మొదలవుతుంది. మూడు గంటల్లో నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు మెటా వంటి సంస్థ ఒక పోస్టులోని పూర్తి సందర్భాన్ని పరిశీలించగలదా? అది నిజంగా చట్టవిరుద్ధమైన సమాచారమా, రాజకీయ విమర్శా, వ్యంగ్యమా, జర్నలిస్టిక్ రిపోర్టింగా అనే విషయాన్ని లోతుగా పరిశీలించడానికి సమయం ఉంటుందా? లేక చట్టపరమైన రక్షణ కోల్పోతామనే భయంతో "ముందు తొలగిద్దాం, తర్వాత చూద్దాం" అనే విధానం వైపు సంస్థలు వెళ్లే అవకాశం ఉందా? ఇదే ఈ వ్యవస్థపై ఉత్పన్నమయ్యే సహజమైన ఆందోళన.అదే సమయంలో ప్రభుత్వ కోణాన్ని కూడా విస్మరించలేం. సోషల్ మీడియా ప్రపంచంలో తప్పుడు సమాచారం, డీప్‌ఫేక్‌లు, మత విద్వేషాన్ని రెచ్చగొట్టే సమాచారం, హింసకు ప్రేరేపించే పోస్టులు కొన్ని గంటల్లోనే లక్షల మందికి చేరగలవు. అలాంటి పరిస్థితుల్లో 24 లేదా 36 గంటలు వేచి చూస్తే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయే అవకాశం ఉంటుంది. అందుకే చట్టవిరుద్ధమైన సమాచారంపై వేగంగా స్పందించే వ్యవస్థ అవసరమని ప్రభుత్వం వాదిస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వాలు, అధీకృత సంస్థలు ఇలాంటి తొలగింపు అభ్యర్థనలను సమన్వయం చేయడానికి సహయోగ్ పోర్టల్ను కూడా ఉపయోగిస్తున్నాయి.అందువల్ల సమస్య "ప్రభుత్వానికి అధికారం ఉండాలా, వద్దా?" అన్నంత సులభమైనది కాదు. దేశ భద్రతకు ముప్పు కలిగించే సమాచారం, హింసకు ప్రేరేపించే పోస్టులు, చట్టవిరుద్ధమైన కంటెంట్‌పై ప్రభుత్వం చర్య తీసుకునే వ్యవస్థ తప్పకుండా అవసరం. అదే సమయంలో రాజకీయ విమర్శను, ప్రభుత్వంపై ప్రశ్నలను, ప్రతిపక్ష అభిప్రాయాలను "అభ్యంతరకరం" అనే పేరుతో తొలగించే పరిస్థితి రాకుండా బలమైన రక్షణలు కూడా అవసరం.ఇక్కడ మనం ఒక ముఖ్యమైన పరీక్ష పెట్టుకోవాలి. మనకు నచ్చిన ప్రభుత్వం చేతిలో ఉన్నప్పుడు ఒక అధికారాన్ని సమర్థించడం సులభం. కానీ రేపు మనకు నచ్చని పార్టీ అధికారంలోకి వచ్చినప్పుడు కూడా అదే అధికారాన్ని వారికి ఇవ్వడానికి మనం సిద్ధంగా ఉన్నామా? సమాధానం "లేదు" అనిపిస్తే, సమస్య ఆ అధికారాన్ని ప్రస్తుతం ఎవరు ఉపయోగిస్తున్నారన్నదానిలో కాదు. ఆ అధికారానికి సరైన హద్దులు ఉన్నాయా అన్నదానిలో ఉంది.ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి అధికారం అవసరమే. కానీ ఆ అధికారంతో పాటు కారణం చెప్పే బాధ్యత, పారదర్శకత, స్వతంత్ర సమీక్ష, న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం కూడా అంతే అవసరం. ప్రభుత్వ ఆదేశం వచ్చినంత మాత్రాన ప్రతి పోస్టు చట్టవిరుద్ధం అయిపోదు. అదే విధంగా "భావ ప్రకటనా స్వేచ్ఛ" పేరుతో చట్టవిరుద్ధమైన ప్రతి సమాచారాన్నీ సోషల్ మీడియాలో కొనసాగించాల్సిన అవసరం కూడా లేదు.అందుకే ఆర్టికల్ 73ను ఈ చర్చకు నేపథ్యంగా అర్థం చేసుకోవచ్చు. అది కేంద్ర ప్రభుత్వ కార్యనిర్వాహక అధికార పరిధిని వివరిస్తుంది. కానీ సోషల్ మీడియా పోస్టును తొలగించే ప్రత్యక్ష చట్టపరమైన వ్యవస్థ సెక్షన్ 79, రూల్ 3(1)(డి) తదితర చట్టపరమైన నిబంధనల నుంచి వస్తుంది. ఈ రెండింటిని కలిపి ఒకటిగా చెప్పడం సరికాదు.టెక్నాలజీ వేగం పెరిగినప్పుడు ప్రభుత్వ చర్య కూడా వేగంగా ఉండాల్సిందే. కానీ ప్రభుత్వం వేగంగా పనిచేయడం ఎంత ముఖ్యమో, ప్రభుత్వం తప్పు చేసినప్పుడు దాన్ని అంతే వేగంగా ప్రశ్నించగల వ్యవస్థ ఉండటం కూడా అంతే ముఖ్యం.ఎందుకంటే ప్రజాస్వామ్యంలో అసలు ప్రశ్న "ఈ అధికారాన్ని ఇప్పుడు ఎవరు ఉపయోగిస్తున్నారు?" అన్నది కాదు."రేపు ఇదే అధికారాన్ని ఎవరు ఉపయోగించినా మన హక్కులు సురక్షితంగా ఉంటాయా?" అన్నదే అసలు ప్రశ్న.

# హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అందరూ గమనించాల్సిన తదుపరి కథ



హైదరాబాద్,భూమిపై స్థలం లేక అంగారక గ్రహం మీద ప్లాట్లు వెతుక్కునే రోజుల్లో... మన కోకాపేట్‌లో ఎకరం భూమి రూ.115 కోట్లు పలికిందట. 'కోట్లు' అంటే మనం ఆడుకునే బోర్డ్ గేమ్‌లో ఉండే కాగితం డబ్బులు కాదండోయ్... నిజమైన రూపాయిలే.. ఆ లెక్కన చూస్తే, అక్కడ గజం భూమి కొనాలంటే జేబులో డబ్బులు కాదు.. రెండు బ్యాంకులు ఉండాలి. గోల్డెన్ మైల్ కాదు కదా... అంత పెట్టి కొన్నాక అక్కడ ఇల్లు కడితే పక్కాగా బంగారం ఇటుకలతోనే కట్టాలేమో.. భవిష్యత్తుపై బెట్టింగ్ అని డెవలపర్లు చెబుతుంటే... "అయ్యా.. మేము ఆకాశంలో కాకుండా నేల మీద కాస్త జాగ ఉందా అని వెతుక్కుంటున్నాం" అని సామాన్యులు అమాయకంగా ఆకాశం వైపు చూస్తున్నారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మరోసారి కోకాపేట్ పేరు మార్మోగుతోంది. సాధారణంగా ఒక ప్రాంతంలో భూమి ధరలు పెరిగాయంటే.. అక్కడ డిమాండ్ పెరిగిందని చెప్పుకోవచ్చు. కానీ కోకాపేట్‌లో తాజాగా జరిగిన భూముల వేలం మాత్రం అంతకంటే పెద్ద విషయాన్ని సూచిస్తోంది. ఇది కేవలం భూమి కొనుగోలు కాదు.. పశ్చిమ హైదరాబాద్ భవిష్యత్‌పై పెట్టుబడిదారులు చేస్తున్న భారీ బెట్టింగ్‌గా చూడాల్సిన పరిణామం. సెప్టెంబర్ 9న హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) నిర్వహించిన ఈ-వేలంలో కోకాపేట్‌లోని న్యూపోలిస్ లేఅవుట్, గోల్డెన్ మైల్ సైట్-1లోని ప్లాట్లకు భారీ డిమాండ్ కనిపించింది.

ఎకరాకు రూ.115 కోట్లు.. రూ.70 కోట్ల ధరను దాటేసిన బిడ్

గోల్డెన్ మైల్ సైట్-1లో 0.70 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ప్లాట్‌కు ఎకరాకు రూ.115 కోట్ల బిడ్ వచ్చింది. ఈ ప్లాట్‌కు హెచ్ఎండీఏ ప్రతిపాదించిన అప్‌సెట్ ధర ఎకరాకు రూ.70 కోట్లు. అంటే ప్రభుత్వ నిర్ణయించిన ధర కంటే ఏకంగా రూ.45 కోట్లు ఎక్కువగా బిడ్డింగ్ జరిగింది. ఇక్కడే అసలు ఆసక్తికరమైన విషయం ఉంది. పెట్టుబడిదారులు ఒక ఎకరం భూమికి ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఇంత భారీగా ఎందుకు చెల్లించడానికి సిద్ధమయ్యారు? దీనికి సమాధానం కేవలం ప్రస్తుత భూమి ధరల్లో ఉండకపోవచ్చు. ఆ భూమి ద్వారా భవిష్యత్తులో వచ్చే వాణిజ్య అవకాశాలపై ఉన్న అంచనాల్లో ఉండొచ్చు.

న్యూపోలిస్‌లో మరో భారీ బిడ్

ఇదే వేలంలో న్యూపోలిస్ లేఅవుట్‌లోని ప్లాట్ నంబర్ 17కు కూడా భారీ స్పందన వచ్చింది. 4.59 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్లాట్‌కు ఒక బిడ్డర్ ఎకరాకు రూ.120 కోట్లు కోట్ చేసినట్లు సమాచారం. అంటే ఒకే వేలంలో ఎకరాకు రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన బిడ్లు రావడం.. కోకాపేట్ భూములకు ఉన్న డిమాండ్ స్థాయిని స్పష్టంగా చూపిస్తోంది. అయితే ఇక్కడ మరో ప్రశ్న తలెత్తుతుంది.

ఎందుకు కోకాపేట్‌నే?

కోకాపేట్‌లో అసలు మారుతున్నది ఏంటి? హైదరాబాద్ విస్తరణ గతంలో నగర శివారు ప్రాంతాల వైపు జరిగేది. కానీ ఇప్పుడు పశ్చిమ హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాలు కేవలం నివాస ప్రాంతాలుగా కాకుండా హై-వాల్యూ బిజినెస్, కమర్షియల్, ఆఫీస్, లగ్జరీ రెసిడెన్షియల్ హబ్‌లుగా మారుతున్నాయి. కోకాపేట్, న్యూపోలిస్, గోల్డెన్ మైల్ వంటి ప్రాంతాలపై పెట్టుబడిదారుల దృష్టి పెరగడానికి ప్రధాన కారణం ఇదే. ఒక ప్రాంతంలో పెద్ద కంపెనీలు, ఆఫీస్ స్పేస్, లగ్జరీ నివాస ప్రాజెక్టులు, మెరుగైన రహదారి కనెక్టివిటీ, మౌలిక వసతులు ఒకేసారి అభివృద్ధి చెందితే.. అక్కడి భూమికి డిమాండ్ సహజంగానే పెరుగుతుంది. అందుకే కోకాపేట్‌లో జరుగుతున్న బిడ్డింగ్‌ను కేవలం "భూమి ధర పెరిగింది" అనే కోణంలో చూడటం కంటే.. "హైదరాబాద్‌లో కొత్త ఆర్థిక కేంద్రం రూపుదిద్దుకుంటోందా?" అనే ప్రశ్నతో చూడటం ఆసక్తికరం.

డెవలపర్లకు ఇది ఏం చెబుతోంది?

ఇంత భారీ ధరకు భూమి కొనుగోలు చేసే పెట్టుబడిదారులు కేవలం ప్రస్తుత మార్కెట్‌ను మాత్రమే చూడరు. భవిష్యత్తులో ఆ భూమిపై అభివృద్ధి చేసే ప్రాజెక్ట్ ద్వారా వచ్చే ఆదాయం, ప్రాంతానికి పెరుగుతున్న డిమాండ్, భవిష్యత్ కమర్షియల్ విలువ వంటి అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. అందువల్ల కోకాపేట్‌లోని తాజా వేలం డెవలపర్లు పశ్చిమ హైదరాబాద్‌పై దీర్ఘకాలిక నమ్మకంతో ఉన్నారనే సంకేతంగా కూడా చూడవచ్చు.

హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు ఇది ఎందుకు కీలకం?

దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో రియల్ ఎస్టేట్ మార్కెట్ వివిధ దశల్లో కొనసాగుతున్న సమయంలో హైదరాబాద్‌లోని కొన్ని కీలక ప్రాంతాల్లో మాత్రం భూమికి ఇంత భారీ డిమాండ్ కనిపించడం ప్రత్యేకంగా మారింది. ముఖ్యంగా నగర పశ్చిమ భాగంలో భూమి లభ్యత పరిమితంగా ఉండటం, అభివృద్ధి చెందుతున్న మౌలిక వసతులు, ఉద్యోగ కేంద్రాలకు సమీపం, ప్రీమియం నివాసాలకు పెరుగుతున్న డిమాండ్ వంటి అంశాలు కలిసి భూమి విలువలను ప్రభావితం చేస్తున్నాయి.అయితే ఒక ముఖ్యమైన విషయం గుర్తుంచుకోవాలి. వేలంలో వచ్చిన అత్యధిక బిడ్ అంటే ఆ ప్రాంతంలోని ప్రతి ఎకరం భూమి అదే ధర పలుకుతుందని అర్థం కాదు. ప్లాట్ స్థానం, రోడ్డు యాక్సెస్, జోనింగ్, అభివృద్ధి సామర్థ్యం, ప్రాజెక్టు అనుమతులు వంటి అనేక అంశాలపై వాస్తవ మార్కెట్ విలువ ఆధారపడి ఉంటుంది.

ఇది రియల్ ఎస్టేట్ బూమ్‌కు సంకేతమా?

కోకాపేట్‌లో జరిగిన ఈ వేలం ఒక్కటే హైదరాబాద్ మొత్తం రియల్ ఎస్టేట్

# వారసుల కోసమే సీనియర్ల ప్రయత్నాలు

శ్రీకాకుళం,ఉత్తరాంధ్ర రాజకీయాల్లో వైఎస్ఆర్‌సీపీ ఖాళీ అవుతోందన్న సంకేతాలు రోజురోజుకూ మరింత బలపడుతున్నాయి. గత సార్వత్రిక ఎన్నికల ఘోర పరాభవం తర్వాత ఉనికి కోల్పోతున్న వైఎస్ఆర్‌సీపీలో కొనసాగడం తమ రాజకీయ భవిష్యత్తుకే కాకుండా, తమ వారసుల అరంగేట్రానికి కూడా ముప్పు అని సీనియర్ నేతలు గ్రహించినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే విజయనగరం జిల్లా పరిషత్ ఛైర్మన్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తన కుమార్తె సిరి సహస్రతో సహా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరిపోయారు. ఈ ఒక్క ఘటన ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని వైఎస్ఆర్‌సీపీ అగ్రనేతలకు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లయింది.ప్రస్తుతం ఉత్తరాంధ్రకు చెందిన పలువురు మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ద్వితీయ శ్రేణి కీలక నేతలు టీడీపీ, జనసేన అధిష్టానాలతో తీవ్రంగా చర్చలు జరుపుతున్నారు. ఈ వలసల వెనుక ఉన్న ప్రధాన రాజకీయ కారణం రాబోయే మహిళా రిజర్వేషన్లు, వారసత్వ రాజకీయం . 2029 నాటికి చట్టసభల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలుకావడం ఖాయమని తేలడంతో పాటు, ఇటీవల టీడీపీ మహానాడులో మంత్రి నారా లోకేష్ బిల్లు పాస్ కాకపోయినా పార్టీ తరఫున మహిళలకు 33% టికెట్లు కేటాయిస్తామని సంచలన ప్రకటన చేశారు. దీంతో తమ కుమార్తెలను లేదా కోడళ్లను రాజకీయ బరిలోకి దించాలనుకుంటున్న సీనియర్ నాయకులకు కూటమి పార్టీలే సురక్షితమైన, ఆశాజనకమైన వేదికలుగా కనిపిస్తున్నాయి.వైఎస్ఆర్‌సీపీ జెండాపై పోటీ చేస్తే భవిష్యత్తులో గెలిచే అవకాశాలు శూన్యమని, తమ వారసుల రాజకీయ జీవితాలు ప్రారంభంలోనే దెబ్బతింటాయని ఈ సీనియర్లు భావిస్తున్నారు. అందుకే, చిన్న శ్రీను తన కుమార్తెను జెడ్పీ ఛైర్‌పర్సన్‌గా నిలబెట్టే ముందస్తు వ్యూహంతో టీడీపీ పసుపు కండువా కప్పుకున్నట్లే.. మిగిలిన ముగ్గురు ఉమ్మడి జిల్లాల నేతలు కూడా తమ మహిళా వారసులను స్థానిక సంస్థలు, రాబోయే అసెంబ్లీ స్థానాలకు స్థిరపరచేందుకు కూటమి నేతలతో రాయబారాలు నెరుపుతున్నారు. మరోవైపు కూటమి ప్రభుత్వం వైపు నుంచి కూడా ఈ వలసలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఏకపక్ష విజయాలు సాధించి, ప్రతిపక్షాన్ని క్షేత్రస్థాయి నుంచి పూర్తిగా తుడిచిపెట్టాలనేది కూటమి వ్యూహం. బలమైన ఓటు బ్యాంక్, సామాజిక వర్గ సమీకరణాలు ఉన్న వైఎస్ఆర్‌సీపీ సీనియర్ల వారసులను చేర్చుకోవడం ద్వారా తమ గెలుపు అవకాశాలను మరింత సుగమం చేసుకోవచ్చని టీడీపీ-జనసేన వర్గాలు లెక్కిస్తున్నాయి. ఉత్తరాంధ్రలో వైఎస్ఆర్‌సీపీ ఒక రకమైన శూన్యతలోకి జారుకుంటోందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఖరి, పార్టీ పునర్నిర్మాణంలో కొరవడిన దిశానిర్దేశం వల్ల విసిగిపోయిన నేతలు.. తమ వారసుల భవిష్యత్తును కాపాడుకునేందుకు పవర్ అండ్ ఫ్యూచర్ ఉన్న కూటమి వైపే మొగ్గు చూపుతున్నారు. రాబోయే స్థానిక పోరు నాటికి ఉత్తరాంధ్ర వైఎస్ఆర్‌సీపీ నుంచి మరిన్ని వికెట్లు పడటం, వారసుల రాజకీయ రంగానికి కూటమి వేదికగా మారడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

## వన్యప్రాణుల రక్షణకు చర్యలు

జగిత్యాల,జిల్లాలో అటవీ సంపద, వన్యప్రాణుల రక్షణకు పోలీస్, అటవీ శాఖలు పరస్పర సమన్వయంతో మరింత సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్, సూచించారు. ఈ రోజు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్, అటవీ శాఖల అధికారులతో నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశంలో జిల్లాలో అటవీ పరిరక్షణకు సంబంధించి చేపడుతున్న చర్యలు, ఇరు శాఖలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరస్పర సహకారం అవసరమైన అంశాలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలు, అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేట, అటవీ భూముల ఆక్రమణ తదితర అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. అటవీ భూములు ఆక్రమణ, అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేటను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని అధికారులకు సూచించారు. అటవీ ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై నిఘా పెంచాలని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులపై సమాచారాన్ని సేకరించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు, అటవీ శాఖకు అందుబాటులో ఉన్న సమాచారాన్ని పోలీస్ శాఖతో పంచుకోవాలని సూచించారు.అటవీ భూముల ఆక్రమణకు సంబంధించిన అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ పేర్కొన్నారు. అటవీ భూముల్లో అనధికారికంగా చేపడుతున్న కార్యకలాపాలను గుర్తించి, సంబంధిత శాఖల సమన్వయంతో వాటిని అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా వేటగాళ్ల కదలికలపై నిఘా పెంచాలని, అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల ప్రజలతో సమన్వయం చేసుకుని అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించాలని తెలిపారు.అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వన్యప్రాణుల వేట, కలప అక్రమ రవాణా, అటవీ భూముల ఆక్రమణ వల్ల కలిగే నష్టాలపై వివరించాలని సూచించారు.

## ఫీల్డ్ లో పనితోనే గుర్తింపు

విజయవాడ,"గంటల తరబడి చేసే రివ్యూలు కాదు... నాకు క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి. రియాక్టివ్ (ప్రతిస్పందించే) పాలన నుంచి ప్రో-యాక్టివ్ (చురుకైన) పాలన దిశగా అధికారులు మారాలి. ఆలోచనలు అద్భుతంగా ఉన్నా, వాటిని అమలు చేయకపోతే అవి నెరవేరని ఆశలుగానే మిగిలిపోతాయి" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ప్రారంభమైన 8వ జిల్లా కలెక్టర్ల సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. రెండు రోజుల పాటు మొత్తం 12 గంటల పాటు సాగే ఈ కీలక సదస్సులో తొలిరోజు, పాలనలో తీసుకురావాల్సిన మార్పులు, అభివృద్ధి లక్ష్యాలపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రజా సేవకులుగా అహంభావాలకు తావివ్వకుండా పనిచేయాలని సూచించిన ముఖ్యమంత్రి, నాయకత్వ లక్షణాలు ప్రదర్శించాలంటే ముందుగా యాజమాన్య బాధ్యత (ఓనర్‌షిప్) తీసుకోవడం అలవర్చుకోవాలని హితవు పలికారు. "ఫైల్ పెండింగ్‌లో ఉందంటే అభివృద్ధి పెండింగ్‌లో ఉన్నట్టే. ఫిర్యాదు పెండింగ్‌లో ఉందంటే ప్రజలకు న్యాయం ఆలస్యమవుతున్నట్టే. ప్రభుత్వాన్ని మభ్యపెట్టే నివేదికలు వద్దు, వాస్తవాలు నిర్భయంగా చెప్పండి. సమస్యను దాచిపెడితే అది పెద్దదవుతుంది, కానీ దానిపై బహిరంగంగా చర్చిస్తే పరిష్కారం లభిస్తుంది. సాధారణ పరిపాలన కాదు, ప్రజలు మెచ్చే సుపరిపాలన అందించాలి. ఇందుకోసం శాఖలు, జిల్లాలు, సెక్రటరీలు, కలెక్టర్లు ఒకరితో ఒకరు ఆరోగ్యకరంగా పోటీపడాలి. 'వన్ స్టేట్-వన్ విజన్-వన్ టీమ్-వన్ మిషన్'... ఇదే మనందరినీ స్వర్ణాంధ్ర లక్ష్యం వైపు నడిపిస్తుంది" అని చంద్రబాబు ఉద్ఘాటించారు.సీఈఓ' కన్నా 'వాటర్ మ్యాన్' గుర్తింపే ఆనందంఈ సందర్భంగా, సాగునీటి రంగంలో ప్రభుత్వం సాధించిన ప్రగతిపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, ఎకనమిక్ టైమ్స్ పత్రిక ముఖ్యమంత్రిని 'సీఈఓ టు

